నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 21 జూన్ 2024 | ADILABAD NIRMAL

శిథిలావస్థలో ధర్మగూడ ప్రభుత్వ పాఠశాల భవనం

శిథిల బడి.. చెట్టు కింద బోధన

నార్నూర్, జూన్ 20 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని ధర్మగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1,2వ తరగతులు ఉన్నాయి. ఇందులో ఒక ఉపాధ్యాయుడు ఉండగా.. 15 మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు వస్తున్నారు. కానీ.. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో కూర్చోవడానికి వారు బయపడుతున్నారు. అసలే వర్షాకాలం నాని ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమి లేక పక్కనే చెట్టు ఉండగా.. దాని నీడన ఉపాధ్యాయుడు బోధిస్తుండగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రమాదం జరగకముందే స్పందించి బడికి మరమ్మతులు చేపట్టాలని లేదా కొత్త భవనం అయినా మంజూరు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చెట్టు కింద విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

అనుమానాస్పదంగా బాలుడి మృతి

- హత్యే అంటున్న కుటుంబ సభ్యులు

సాయికుమార్(ఫైల్)

ఉట్నూర్, జూన్ 20 : తప్పిపోయిన బాలుడు చెరువులో శవమై కనిపించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఉట్నూర్ సీఐ మురళి, ఎస్ఐ మనోహర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ గోపాల్ కూలీ పనిచేస్తూ జీవిస్తున్నారు. గత మూడు రోజుల క్రితం ఇంట్లో అందరు పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి రాథోడ్ సాయికుమార్(9) కనిపించ లేదు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. గురువారం సాయంత్రం స్థానిక గోపయ్య చెరువులో బాలుడి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి జాలర్ల సాయంతో బయటకు తీశారు. అనంతరం పంచనామా కోసం దవాఖానకు తరలించారు. బాలుడిని ఎవరైనా చంపారా? లేక ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు తన కుమారుడిని హత్య చేశారని ఆరోపిస్తున్నారు. పోలీసుల విచారణలో అది హత్యా? ప్రమాదవశాత్తు మరణించాడా? అని తెలియాల్సి ఉంది.

డవ్ ఎన్జీవో రిజిస్టర్‌ను పరిశీలిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

డవ్‌పై కలెక్టర్ అసహనం

- రిజిస్టర్లు మెయింటెనెన్స్ చేయక పోవడంపై ఆగ్రహం
- డవ్ ఎన్జీవోకు నోటీలు జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీకి ఆదేశాలు

ఎదులాపురం, జూన్ 20 : మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలన చికిత్స, పునరావాస కేంద్రం (డవ్) అస్తవ్యస్తంగా మారడంపై కలెక్టర్ రాజర్షి షా అసహనం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీచర్‌కాలనీలో గల డవ్ ఎన్జీవో కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, నైట్‌షిఫ్ట్ రిజిస్టర్లు వేరువేరుగా ఎందుకు ఉంచడం లేదని ప్రశ్నించారు. అనంతరం పేషెంట్లకు కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. డవ్ సెంటర్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నోటీసులు జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీ సబితకు ఆదేశాలు జారీ చేశారు. నెలలో రెండు సార్లు విజిట్ చేసి నివేదికలను సమర్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఐసీడీఎస్ పీడీ సబిత, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిణి మిల్కా, డీసీపీవో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కారం

- 'నమస్తే' కథనానికి స్పందన

నార్నూర్, జూన్ 20 : తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ అన్నారు. 'తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో గురువారం నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య తలెత్తితే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయన వెంట పంచాయతీ కార్యదర్శి అనురాగ్ ఉన్నారు.

నార్నూర్‌లో నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

టీచర్ల పదోన్నతుల బదిలీ ఉత్తర్వుల్లో జాప్యం

డీఈవో కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల నిరసన

డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు

ఎదులాపురం, జూన్ 20 : ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీ ఉత్తర్వులపై విద్యాశాఖ ఎడతెగని జాప్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ డీఈవో కార్యాలయం ఎదుట భాషా పండితులు నిరసన చేపట్టారు. తప్పులు తడకగా జాబితాలు రూపొందించి ఆ తర్వాత సరిదిద్దామని ప్రకటన జారీ చేశారు. మూడు రోజులైనా ఉపాధ్యాయుల చేతికి ఉత్తర్వులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పదోన్నతుల కోసం 110 మంది భాషా పండితులు గంటల తరబడి వేచి చూస్తున్నారని తెలిపారు. అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదని నాయకులు వాపోయారు. అనంతరం డీఈవో ప్రణీతను కలిసి విషయాన్ని తెలిపారు.

కేసీఆర్‌తోనే కరెంటు బాగైంది..

పరిశ్రమలు, చిరు వ్యాపారాలకు పునరుజ్జీవం పోసింది..

- 2014కు ముందు 8 నుంచి 10 గంటలే కరెంటు ఉండేది..
- కేసీఆర్ వచ్చినంక 24 గంటలు జిగేల్
- పెరిగిన ఉత్పత్తి, కూలీలకు ఉపాధి
- పరిశ్రమలు, చిరు వ్యాపారుల మనోగతం

తెలంగాణ రాక ముందు, కేసీఆర్ సీఎం కాక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరెంట్ కోతలు, తీవ్రమైన విద్యుత్ సంక్షోభం ఉండేది. గాలులు, వర్షాలకు కరెంట్ పోతే రోజుల తరబడి రాకపోయేది. పట్టణాల్లో రోజుకు ఆరు గంటలు, గ్రామాల్లో 8 నుంచి 10 గంటలు మాత్రమే ఉండేది. ఎప్పుడు కరెంట్ వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియని దుస్థితి. ఇక పరిశ్రమలకు రోజుకు 10 గంటల కరెంట్ ఇస్తే అదే గొప్ప. తెలంగాణ వచ్చాక 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. దీంతో పరిశ్రమల్లో ఉత్పాదకత పెరిగింది. కూలీలకు ఉపాధి దొరికింది. చిరువ్యాపారులకు చేతినిండా పని లభించింది. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పారిశ్రామిక పెట్టుబడులు పెరిగాయి. ఏం చేసిండో.. ఎవ్వరిని బతిమిలాడిండో.. ఎవ్వరి మెడమీద కత్తి పెట్టిండో తెలియదు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చి మంచి పని చేసిండు. ఇప్పుడా ఆ కరెంట్‌పైనే రాజకీయాలు చేయడం సరికాదు. 24 గంటల కరెంట్‌తో మారిన బతుకులు ఎన్నో ఉన్నాయ్. ఎవ్వరెన్నీ రాజకీయాలు చేసినా, కేసీఆర్ మీద నిందలు మోపినా.. మా మనసుల్లో మాత్రం ఆయన మేలు చిరస్థాయిగా ఉంటుంది. ఇప్పుడు కొత్త సర్కారు వచ్చి ఆరున్నర నెలలు కూడా కాకముందే కోతలు మొదలైనయ్. అడపాదడపా కరెంట్ పోతుండడంతో ఇబ్బందులు పర్పడుతున్నయ్ అంటున్నారు పరిశ్రమల నిర్వాహకులు, చిరు వ్యాపారులు. వారి అనుభవాలు వారి మాటల్లోనే..

- మంచిర్యాల, జూన్ 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

అప్పుడే వ్యాపారం బాగుండే..

నిర్మల్ అర్బన్, జూన్ 20 : కొన్నేండ్లుగా ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్నా. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల కరెంట్ సదుపాయం ఉండే. నిరంతరం ప్రింటింగ్ ప్రెస్ పనులను చేసుకునే వాళ్లం. మా వ్యాపారాలు బాగా నడిచేవి. కరెంట్ పోతుందన్న దిగులు ఉండేది కాదు. ఎప్పుడు దుకాణం తీసినా మిషన్ చాలు చేసి ప్రింటింగ్ పనులు నిర్వహించుకునే వాళ్లం. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు షురూ కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలు నడుపుకునే వారికి ఉచిత విద్యుత్‌ను అందించాలి.

- సంతోష్, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు, నిర్మల్.

కేసీఆర్ హయాంలోనే మంచిగుండే..

బైంసా, జూన్ 20 : కాంగ్రెస్ సర్కారు హయాంలో కరెంటు కోతలు విపరీతంగా ఉంటున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో నిరంతరం కరెంటు ఉంటే.. కాంగ్రెసోళ్లు 14 గంటలు మాత్రమే ఇస్తున్నారు. నేను బైంసా పట్టణంలో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తాను. నిరంతరం కరెంటు ఉంటే రోజూ రూ.1000లు దొరికేవి. మంచిగా బతికేవాళ్లం. గిప్పుడు కరెంటు కోతల వల్ల పని కావడం లేదు. ఎవరైనా ఆర్డర్ ఇస్తే ఒక్క రోజులో అయ్యే పని రెండు, మూడు రోజులు పడుతున్నది. ఇలాగైతే ఎట్లా పనిచేస్తం. బతుకుడు ఎలా బతుకుతం.

- ఎండీ షోయబ్, వెల్డింగ్ మెకానిక్, బైంసా.

కరెంటు కష్టాలు మళ్లీ మొదటికి..

గుడిహత్నూర్, జూన్ 20 : కేసీఆర్ పాలనలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేసుకుని హాయిగా ఇంటికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక షాపులో కరెంటు కోసం ఎదురు చూస్తున్నాం. చిన్నపాటి చినుకులు పడినా, గాలివీచినా, ఉరుములు, మెరుపులు వచ్చినా కరెంటు తీసేస్తున్నారు. మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. కరెంట్లోళ్లకు ఫోన్ చేస్తే లైన్ బాగా లేదని చెబుతున్నారు. కాంగ్రెస్ పాలన వచ్చాక కరెంటు కష్టాలు మొదటికి వచ్చాయి. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని కాంగ్రెసోళ్ల మాటల్లో నిజం లేదు. కరెంటు విషయంలో కేసీఆర్‌ను మరచిపోలేం.

- ముండె గజానంద్, వెల్డింగ్ షాప్ యజమాని, గుడిహత్నూర్

చీటికీ మాటికీ కరెంటు పోతున్నది..

నిర్మల్ అర్బన్, జూన్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంటు కోతలు పెరిగాయి. కేసీఆర్ ప్రభుత్వంలో నిరంతరం కరెంట్ ఉంటుండే. వ్యాపారాన్ని సజావుగా చేసుకునే వాళ్లం. గతంలో కరెంట్ కోతలు లేకపోవడంతో ఇబ్బంది లేకుండే. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో చీటికీమాటికీ విద్యుత్ పోతున్నది. మొబైల్ ఫోన్‌లు రిపేరు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వ్యాపారం దెబ్బతింటున్నది. ఉచిత విద్యుత్ సంగతి ఏంటో గానీ.. ప్రభుత్వం ప్రజలందరికీ 24 గంటల విద్యుత్ అందించాలి.

- రిజ్వాన్, మొబైల్ దుకాణం నిర్వాహకుడు.

సంపూర్ణ ఆరోగ్యం అందిద్దాం

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎదులాపురం, జూన్ 20 : చిన్న వయసులోనే పిల్లల్లో నులి పురుగులను నివారిస్తే వారిలో రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసి, మాట్లాడారు. నులి పురుగులు పిల్లలు తీసుకున్న ఆహారంలో నుంచి పోషకాలను గ్రహించి వారిని శక్తిహీనులుగా మారుస్తాయన్నారు. దీంతో పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, శక్తి హీనతవంటి సమస్యలు వస్తాయన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థ యేటా రెండు సార్లు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 2,21,141 మంది పిల్లలకు మాత్రలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. వేసుకోనటువంటి పిల్లలకు ఈనెల 27వ తేదీన మళ్లీ మాత్రలు ఇస్తారని గుర్తు చేశారు. కచ్చితంగా 1-19 ఏండ్ల మధ్య పిల్లలు మాత్రలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఐవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, డీఈవో టి.ప్రణీత, డీఐఈవో రవీందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ సర్ఫరాజ్, శాంతినగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాజారెడ్డి పాల్గొన్నారు.

పిట్టలవాడ ప్రాథమిక పాఠశాలలో..

పట్టణంలోని పిట్టలవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆడే సురేశ్, నల్ల ఈశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు భీమ అంబయ్య పాల్గొన్నారు.

ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పార్టీ నాయకులు

'నీట్' అక్రమాలపై విచారణ జరిపించాలి

ఎదులాపురం, జూన్ 20 : మే 5వ తేదీన ఎన్‌టీఏ నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నందున పరీక్షను రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టీఏ చెలగాటం ఆడడం దారుణమన్నారు. బిహార్‌లో పేపర్ లీక్ కావడం, ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 లక్షలు లంచాలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఎన్‌టీఏ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 69 మందికి మొదటి ర్యాంక్ వచ్చాయన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ రాష్ట్రాలవారీగా పాత పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లంక రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, మండల నాయకులు దొనిపెల్లి స్వామి, అరవింద్, పండుగ పోచ్చన్న, అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

రూ.27 వేలు ఇవ్వాలి

- లేబర్ కోడ్స్ అమలు చేయబోమని తీర్మానం చేయాలి
- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎదులాపురం, జూన్ 20 : కార్మికులకు కనీస వేతనం రూ.27 వేలు ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ నారాయణ మాట్లాడుతూ.. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20 లక్షలు, సహజ మరణానికి రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, 58 ఏండ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గౌరాల సుభాష్, దేవీదాస్, ఆర్కా శేషరావు, మెస్రం మారుతి, భగత్ సంజయ్, పెర్క గంగమ్మ, రాజు, లక్ష్మణ్, ఉల్గారాజ్, అశోక్, ప్రకాశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రాజి హరీశ్, మాడావి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సహాయ, సహకారాలు అందిస్తాం

- ఎస్పీ గౌష్ ఆలం
- రూ.8 లక్షల చెక్కు అందజేత

ఎదులాపురం, జూన్ 20 : విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మార్చి 8, 2024న మహా శివరాత్రి సందర్భంగా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం వద్ద విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో కానిస్టేబుల్ మార్కండేయ మృతిచెందాడు. గురువారం పోలీస్ ముఖ్య కార్యాలయంలో మార్కండేయ భార్య కే.సుజాత, కొడుకు కె.నిఖిల్‌లకు భద్రత చెక్కు రూ.8 లక్షలను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 24 గంటలు అవిశ్రాంతంగా విధులు నిర్వర్తించే పోలీసులు, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పోలీసు యంత్రాంగానికి, వారి కుటుంబ సభ్యులకు కేర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం